సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం ; 8 ; సెప్టెంబర్ ; 2023



వరిలో తెగుళ్ల బెడద

వానలతో వరికి తెగుళ్లు ఆశిస్తాయి. రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. - IIలో



అనుమతులు సులభం

పంచాయతీలు ఇకపై ప్లాన్ అప్రూవల్స్ చేయనున్నాయి. దీనివల్ల అనధికార కట్టడాలకు చెక్ పడుతుంది. - IIలో



పరీక్షల ఫలితాలు విడుదల

బీఆర్ఏయూలో పలు పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. వీటిని వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచారు. - IIలో

న్యూస్‌రీల్

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డు కోసం పరిశీలన



ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

గార: ఈ ఏడాది అక్టోబర్ 2న కేంద్ర ప్రభుత్వం అందించనున్న స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డు ఎంపిక కోసం కె. మత్స్యలేశం పంచాయతీని గురువారం కేంద్రబృందం పరిశీలించింది. కేంద్ర బృందం ప్రతినిధి చిరంజీవి ఆధ్వర్యంలో సభ్యులు పంచాయతీలోని ఓడీఎఫ్ పరిస్థితి, మురుగు కాలువ సిస్టమ్, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, ఎస్‌డబ్ల్యూపీసీ యూనిట్, పాఠశాలలు, అంగన్‌వాడీలు, కమ్యూనిటీ మరుగుదొడ్లు, 60 గృహాలను సందర్శించి నివేదికలు తయారు చేశారు. నివేదిక ఆధారంగా స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డులను ప్రకటిస్తారని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.లలిత యర్రన్న, సెక్రటరీ ప్రసాద్, పద్మావతి, వలంటీర్లు, గ్రీన్ ఎంబాసిడర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 55 మంది ఎంపిక



హాజరైన నిరుద్యోగ అభ్యర్థులు, యువత

శ్రీకాకుళం న్యూకాలనీ: అందివచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని, అందులో ఉన్నతంగా రాణించి గుర్తింపు పొందాలని జిల్లా ఉపాధి అధికారిణి కొత్తలంక సుధ అన్నారు. గురువారం హెట్రో, ముత్తూట్, పేటీఎం, శ్రీరామ్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్ సంస్థల్లో ఉద్యోగాల కోసం శ్రీకాకుళంలోని డీఎల్‌టీసీ కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాకు జిల్లా నలుమూలల నుంచి 102 మంది హాజరుకాగా ఇందులో అర్హులైన 55 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌టీసీ ఏడీ వై.రామ్‌మోహనరావు, సెట్‌శ్రీ నుంచి నాయుడు, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పసిప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది



ఆక్సిజన్ ఎక్కిస్తూ శిశువును రిమ్స్‌కు తరలిస్తున్న 108 సిబ్బంది

టెక్కలి: అప్పుడే పుట్టిన ఓ శిశువుకు టెక్కలి 108 సిబ్బంది సకాలంలో వైద్యం అందజేసి ప్రాణాలు కాపాడారు. కోటబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతున్నారని, ఆమెను శ్రీకాకుళం తీసుకెళ్లాలని 108 సిబ్బందికి గురువారం సమాచారం వచ్చింది. సిబ్బంది ఆస్పత్రికి చేరుకునేలోగా ఆ గర్భిణి ఆడ శిశువుకు జన్మనిచ్చారు. అయితే ఆ శిశువులో ఎలాంటి చలనం లేకపోవడంతో, 108 సిబ్బంది ఆస్పత్రి సిబ్బంది సహకారంతో సీపీఆర్ ప్రక్రియ చేసి శిశువులో కదలికలు తీసుకువచ్చారు. 108 వాహనంలో గల బీవీఎం ద్వారా శిశువుకు ఆక్సిజన్ ఎక్కిస్తూ హుటాహుటిన జిల్లా కేంద్రంలో గల ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం నుంచి శిశువును కాపాడిన సీహెచ్‌సీ మెడికల్ అధికారి సంధ్యారాణి, 108 సిబ్బంది సింహాచలం, శశిను పలువురు అభినందించారు.

రాహుల్‌కు సంఘీభావంగా యాత్ర

శ్రీకాకుళం అర్బన్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర ప్రారంభించి ఒక ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం ఇందిరా విజ్ఞాన్ భవన్ నుంచి సంఘీభావంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి నేతృత్వంలో సంఘీభావ ర్యాలీ సాగింది.

పర్యవేక్షణ లోపమే.. శాపమాయె!

- మార్కెటింగ్ శాఖలో అక్రమాల వెనుక ఉన్నత స్థాయి అండదండలు
- అక్రమాలకు పాల్పడిన చిన్ని కృష్ణపై గతంలో అనేక ఫిర్యాదులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- లైంగిక వేధింపుల ఆరోపణను సైతం పక్కన పెట్టేసిన వైనం
- ఇన్నాళ్లకు ఆయనపై విచారణకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ నియామకం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : మార్కెటింగ్ శాఖలో అక్రమాలకు పాల్పడిన కార్యదర్శి చిన్ని కృష్ణకు ఉన్నత స్థాయి అండదండలు ఉన్నాయి. ఆ శాఖలో జరిగిన పరిణామాలు గమనిస్తే ఆ వాదనలకు బలం చేకూరుతోంది. అవినీతి ఒక్కటే కాదు తోటి మహిళా ఉద్యోగులతో అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. గతంలో దీనిపై ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు.. సరికదా అయనే బాగా పనిచేస్తున్నాడంటూ ఉన్నతాధికారులు ప్రశంసించారు. ఉన్నతాధికారుల వత్తాసు ఉండటంతోనే కోట్ల రూపాయల నిధులను పక్కదారి పట్టించడమే కాకుండా ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా ఆయన వైఖరి మారిందని ఆ శాఖ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

ఫిర్యాదులు వచ్చినా..

- మార్కెటింగ్ శాఖ నిధులు తన సొంత ఖాతాలకు మళ్లింపు వ్యవహారం వెలుగు చూడకముందు ఆ శాఖ నెల వారీ సమీక్షలో ఓ ఉన్నతాధికారి చిన్ని కృష్ణ గురించి గొప్పగా పొగిడారు. ఈయన లాగా డిపార్ట్‌మెంట్‌లో ఎవరూ పనిచేయలేరని, చెయ్యరని ప్రశంసించారు. ఆ అభిమానంతోనే అంతకుముందు తీసేసిన ఎఫ్ఏసీ బాధ్యతలు మళ్లీ అప్పగించారు.
- ఎచ్చెర్ల మార్కెట్ కమిటీలో పనిచేసిన ఒక మహిళా ఉద్యోగిని ఆయన లైంగికంగా వేధించారు. దీనిపై ఆ మహిళ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే.. కనీసం చర్యలు తీసుకోలేదు.
- చిన్నికృష్ణ కార్యదర్శిగా పనిచేసిన మార్కెట్ కమిటీల్లో అక్కడ పాలక వర్గాలను కనీసం పట్టించుకోలేదు. వారి మాటకు ఏ మాత్రం విలువ ఇవ్వలేదు. సరికదా నిధుల వినియోగంలో కూడా పాలకవర్గాన్ని కనీసం సంప్రదించలేదు. ఈ వ్యవహారంలో కూడా ఫిర్యాదులొచ్చాయి. కానీ ఉన్నతాధికారులు పక్కన పెట్టేశారు.
- కార్యదర్శిగా పనిచేసిన చిన్నికృష్ణను ఉన్నతాధికారులు ఎంత వెనకేసుకోచ్చారో చెప్పడానికి ఈ ఉదాహరణలు చాలు. ఉన్నతాధికారులు ఇంతగా అండగా నిలవడానికి కారణం లోపాయికారీ ఒప్పందాలనేనని మార్కెటింగ్ శాఖ వర్గాలు బాహాటంగానే చెప్పుకొస్తున్నాయి. చిన్ని కృష్ణ కూడా చాలా తెలివిగా వ్యవహరించినట్టుగా స్పష్టమవుతోంది. నిధులు మళ్లింపు వ్యవహారంలో ఉన్నతాధికారులను కూడా భాగస్వామ్యం చేసినట్టుగా తెలుస్తోంది. వారి ఖాతాలకు కూడా పక్కదారి పట్టించిన సొమ్మును పంపించినట్టు మార్కెట్ శాఖలో కోడై కూస్తోంది. ఈ లెక్కన మా ర్కెటింగ్ శాఖలో నిధులు దారి మళ్లింపు వ్యవహారంలో ఒక్క చిన్నికృష్ణకే కాకుండా దాంట్లో పాలు పంచుకున్న అధికారుల పాత్ర కూడా తేలాల్సి ఉంది. ఇప్పుడా దిశగా మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే ముందు కెళ్తున్నట్టు తెలుస్తోంది. రెగ్యులర్, ఇన్‌చార్జి హోదాలో కార్యదర్శిగా పనిచేసిన ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీల్లోనే కాకుండా గతంలో పనిచేసిన పలాస మార్కెట్ కమిటీలో కూడా విచారణ చేయిస్తున్నారు. మొత్తం లెక్క తేల్చే పనిలో నిమగ్నమయ్యారు.

రూ. 4కోట్లకు దాటిన అవినీతి

మార్కెట్ కమిటీ నిధులను పక్కదారి పట్టించిన చిన్నికృష్ణపై ప్రస్తుతం లోతుగా విచారణ జరుగుతోంది. పరిశీలిస్తున్న కొద్దీ అక్రమంగా డ్రా చేసిన మొత్తం పెరుగుతూ వస్తోంది. ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల, పలాస మార్కెట్ కమిటీల్లో ప్రస్తుతం రికార్డుల పరిశీలన జరుగుతోంది. ఇప్పటివరకైతే మళ్లించిన సొమ్ము రూ. 4కోట్ల వరకు లెక్క తేలినట్టు సమాచారం. ఇది మరింత పెరిగే అవకాశం కనబడుతోంది. మరో నాలుగైదు రోజుల్లోకి అవినీతి లెక్క తేలే అవకాశం ఉంది. ఇదంతా చూస్తుంటే మార్కెటింగ్ శాఖలో పర్యవేక్షణ లోపించడమే కాకుండా ఉన్నతాధికారుల ఉదాసీనత ఉన్నట్టు స్పష్టంగా కనబడుతోంది. ఇప్పటికే అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు మరో ముగ్గురు ఉద్యోగులను కమిషనర్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇదంతా పూర్తయితే ఇంకెవరి పాత్ర తేలనుందో, ఇంకెవరు వేటుకు గురవుతారో వేచి చూడాలి.



లైంగిక వేధింపులపై విచారణకు ప్రత్యేక కమిటీ

ఎచ్చెర్ల మార్కెట్ కమిటీలో పనిచేసిన మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని చిన్నికృష్ణపై ఆరోపణలు చేస్తూ ఆ మహిళ చేసిన ఫిర్యాదును తన పై అధికారులు తొలుత పట్టించుకోలేదు. ఎంతకీ చర్యలు తీసుకోకపోవడంతో మహిళ ఫిర్యాదు వ్యవహారం కమిషనర్ దృష్టికి వచ్చింది. ప్రత్యేకంగా విచారణ జరిపితే మొత్తం వివరాలు చెప్పేందుకు ఆ మహిళ కూడా ముందుకు రావడంతో జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని కమిషనర్ నియమించారు. ఇప్పుడా కమిటీ విచారణ చేసేందుకు సిద్ధమవుతోంది. ఇందులో నిజం నిర్ధారణైతే చిన్ని కృష్ణ బాగోతం మొత్తం బయటపడుతుంది.

వలస వచ్చి.. సంక్షేమం పొంది



చిత్రంలో మంత్రి సీదిరి అప్పలరాజుతో ఉన్న వారు ఒడిశాకు చెందిన వారు. సకలాభక్తుల వరోధిని కుటుంబం పర్లాఖిమిడి నుంచి వచ్చి పలాసలో స్థిరపడింది. వీరికి ప్రభుత్వం రేషన్‌కార్డు, ఫించన్, డ్వాక్రా, వాహనమిత్ర వంటి పథకాలన్నీ అందజేసింది. ఒడిశాలో కంటే ఆంధ్రాలోనే బాగుందని వీరు మంత్రితో ఆనందం పంచుకున్నారు. పలాస-కాశీబుగ్గ 14వ వార్డులో గురువారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వంలో మంత్రి సీదిరి వీరిని కలిశారు. - కాశీబుగ్గ

వానందం



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో విస్తారంగా వాన లు కురుస్తున్నాయి. బుధవారం జిల్లాలో 221.2 మిల్లీమీటర్ల వర్షం కురవగా, గురువారం జిల్లా వ్యాప్తంగా 997.8 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఇటీవల తగినంత వర్షం లేక, వరి నాట్లు ఎండుతున్న సమయంలో రెండు రోజుల పాటు వర్షాలు కురవడంతో వరి పంటకు మేలు జరిగింది. గురువారం జిల్లాలో ఎక్కువగా సారవకోటలో 120.2 మిల్లీమీటర్లు, పలాసలో 114.4 మిల్లీమీటర్లు, మెళియాపుట్టిలో 92.4 మిల్లీమీటర్లు, పాతపట్నంలో 67.4, మందసలో 56.2 మిల్లీమీటర్లు, 47.2 మిల్లీమీటర్లు, కొత్తూరులో 44.2 మిల్లీమీటర్లు, ఎల్ఎన్‌పేటలో 42.2 మిల్లీమీటర్లు, జలుమూరులో 40.4, సరుబుజ్జిలిలో 38.8, జి.సిగడాంలో 30.4 మిల్లీమీటర్ల వాన పడింది.

అభ్యంతరాలు తెలియజేయండి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2024 ప్రక్రియలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లాఠకర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఈ నెల 14న 5,850 కంట్రోల్ యూనిట్లు రానున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారని, వాటిని పొందాల్సి ఉందని తెలిపారు. యూనిట్లు స్వీకరించే సమయాన్ని ముందుగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేస్తామన్నారు. పోలింగ్ స్టేషన్ల రెగ్యులైజేషన్ ప్రక్రియలో భాగంగా అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో అన్ని పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఈ నెల 15న డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన వివరాలను మీకు అందజేస్తామని, జిల్లాస్థాయిలో ఈ నెల 20న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటుచేస్తామని కలెక్టర్ వివరించారు. అందులో ప్రతినిధుల అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. శ్రీకాకుళం అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని ఇప్పిలి గ్రామానికి చెందిన బీఎల్‌ఓలు విధులను సక్రమంగా నిర్వహించడం లేదని బీజేపీ ప్రతినిధి ఫిర్యాదు చేయగా, టీడీపీ ప్రతినిధి ఓటర్ల జాబితాలోని తొలగింపులు, డూప్లికేట్ ఓటర్లకు సంబంధించి పెండింగులో ఉన్నవాటిని త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లాలో వచ్చిన అన్ని క్లెయిములు, అభ్యంతరాలను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేసేలా సంబంధిత మండల తహసీల్దార్లను ఆదేశించామని కలెక్టర్ వివరించారు. బీఎల్‌ఓ యాప్‌లోని అన్ని చేర్పులు, తొలగింపులు, సవరణ ఓటర్ల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించినట్లు చెప్పారు. తొలగింపులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను మరోమారు పునఃపరిశీలన చేసి సరిచేసిన వాటిని జాబితాలోకి తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేసినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'ఆ నోటిఫికేషన్ వర్సిటీది కాదు'

ఎచ్చెర్ల క్యాంపస్: సోషల్ మీడియాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రెగ్యులర్ బోధకుల నోటిఫికేషన్ అంటూ ప్రచారం జరుగుతోందని, ఈ ప్రచారంలో నిజం లేదని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ వర్సిటీదిగా ప్రచారం జరుగుతోందని అన్నారు. అభ్యర్థులు గమనించాలని సూచించారు. ఆ నోటిఫికేషన్‌తో వర్సిటీకి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. వర్సిటీ నోటిఫికేషన్ త్వరలో విడుదలవుతుందని, పత్రికా ప్రకటనతో పాటు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని వివరించారు.

కన్నయ్యా.. ఆరగించవయ్యా

నారాయణ తిరుమలలో ఊయల సంబరం



ఇచ్ఛాపురం: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మున్సిపాలిటీ పరిధి కంద్రవీధిలోని రాధాకృష్ణ ఆలయంలో స్వామికి 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. రవీంద్ర భారతి పాఠశాల ఆవరణలో చిన్నారులు వేషధారణలతో అలరించారు.



కంద్రవీధిలోని స్వామికి 108 రకాల నైవేద్యాలు



రాధా గోవిందస్వామి ఆలయంలో హారతులిస్తున్న అర్చకులు

శ్రీముఖలింగంలో..

జలుమూరు: దక్షిణ కాశీగా పేరు గాంచిన శ్రీముఖలింగేశ్వరుని ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి బాల కృష్ణుడిని ఊయలలో వేసి పాటలు పాడారు. అనంతరం మంగళ హారతులిచ్చారు. రాధా గోవిందస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాధా గోవింద సామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఘనంగా చల్లకంబాల ఉత్సవం



రాధా కృష్ణుల వేషధారణలో ఆలయ అర్చకుల పిల్లలు, మనుమలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గురువారం సాయంత్రం చల్లకంబాల ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను వెండి సప్తాశ్వ వాహనం మీద తిరువీధి నిర్వహించి ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అక్కడే ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన ముఖద్వారానికి ఎదురుగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురు చిన్నారులు రాధా కృష్ణుల వేషధారణతో ఆకట్టుకున్నారు.



నారాయణ తిరుమలలో ఉట్టి కొట్టే సంబరం

పునరావాసంపై విషం

- మూలపేట పోర్టు నిర్వాసితులను రెచ్చగొట్టేందుకు 'ఆంధ్రజ్యోతి' తాపత్రయం
- ఆంధ్రజ్యోతి కథనాన్ని తీవ్రంగా ఖండించిన కలెక్టర్
- వాస్తవాలను వివరిస్తూ ప్రకటన విడుదల



సంతబొమ్మాళి మండలం కస్పానౌపడ గ్రామం వద్ద పోర్టు నిర్వాసితుల కోసం పునరావాస కాలనీలో ఎత్తు చేసేందుకు మట్టి పనులు చేస్తున్న దృశ్యం

టెక్కలి: జిల్లాకే తలమానికంగా మారనున్న సంతబొమ్మాళి మండలం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి భూములను త్యాగం చేసిన సుమారు 594 మంది నిర్వాసితులకు కస్పా నౌపడ సమీపంలో సుమారు 55 ఎకరాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో ప్రభుత్వం పునరావాసం కల్పిస్తోంది. అనేక దశల్లో సంప్రదింపులు, అంగీకారాల తర్వాత ఇక్కడ పనులు మొదలుపెట్టి వాయువేగంతో చేస్తున్నారు. ఈ దశలో నిర్వాసితులను రెచ్చగొట్టడానికి పచ్చ పత్రికలు పనిలోకి దిగాయి. అభివృద్ధిని అడ్డుకునే రీతిలో వరుస కథనాలను వండి వారుస్తున్నాయి. తాజాగా ఆంధ్రజ్యోతి 'ముంపు ప్రాంతంలో పునరావాసం' అంటూ ఓ కథనాన్ని అచ్చేసింది. ఈ కథనంపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. నిర్వాసితుల అంగీకారం మేరకే కస్పా నౌపడ సమీపంలో పునరావాస కాలనీ ఏర్పాటు చేయడంతో పాటు పనులు వేగవంతం చేస్తున్నామని స్పష్టం చేశారు. దీనిపై పూర్తి వివరాలు వెల్లడించారు.

- నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తున్న ప్రాంతం పూర్తిగా ముంపు ప్రాంతమని, చిన్నపాటి వానకే మునిగిపోతుందని కథనంలో ఆరోపించారు. అయితే నిర్వాసితులతో పూర్తిస్థాయి సంప్రదింపులు జరిపిన తర్వాతనే ఈ ప్రాంతాన్ని ఆమోదించామని కలెక్టర్ ప్రకటనలో స్పష్టం చేశారు. గత ఏడాది నవంబర్ 16న జరిగిన గ్రామసభలో మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తులు పునరావాస ప్రాంతాన్ని అంగీకరించారని గుర్తు చేశారు. గ్రామసభ కూడా నిర్వహించామని, శంకుస్థాపన సమయంలో సీఎం వైఎస్ జగన్ కూడా పునరావాసంపై స్పందించారని, మూడు నెలలుగా ఒక్క నిర్వాసితుడి నుంచి కూడా అభ్యంతరం రాలేదని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం పునరావాస కాలనీ ప్రాంతంలో 2 మీటర్ల ఎత్తున మట్టిపోత పనులు జరుగుతున్నాయని, అన్ని వసతులు కల్పించిన తర్వాతే పునరావాస కాలనీ వద్దకు నిర్వాసితులను పంపిస్తామని స్పష్టం చేశారు.
- పునరావాస ప్రాంతంలో ఉప్పు నీరు పడుతుంది కాబట్టి ఇక్కడి నుంచి కాలనీని మార్చాలని నిర్వాసితులు కోరుతున్నట్లు కథనంలో ప్రచురించారు. అయితే గ్రామ సభ తీర్మానం తర్వాతే ఇక్కడ పనులు ప్రారంభించామని, ఉప్పునీటి సమస్యకు పరిష్కారంగా యామాలపేట నుంచి గానీ టెక్కలి నుంచి గానీ పునరావాస కాలనీకి మంచి నీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. పూర్తిస్థాయి మంచినీటి వసతి కల్పించిన తర్వాతే నిర్వాసితులను అక్కడకు పంపిస్తామని, ఈ విషయం వారికి ముందుగానే చెప్పామని ఆయన వివరించారు. ప్రస్తుతం కస్పానౌపాడ గ్రామానికి యామాలపేట మంచి నీటి సరఫరా జరుగుతోందని గుర్తు చేశారు.
- నిర్వాసితులకు తెలియకుండా పునరావాస కాలనీ స్థలం ఎంపిక చేశారని ఆంధ్రజ్యోతి అచ్చు వేసింది. ఇది పూర్తిగా అవాస్తవమని కలెక్టర్ స్పష్టం చేశారు. గత ఏడాది నవంబర్ 16న గ్రామసభలో ఆయా గ్రామస్తులు అంగీకారం తెలిపారని, ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని తెలిపారు.





మూలపేట పోర్టు నిర్వాసితుల కోసం కస్పా నౌపడ వద్ద కేటాయించిన పునరావాస కాలనీ ప్రాంతం

క్లుప్తంగా

'ఫ్యామిలీ డాక్టర్' సద్వినియోగం చేసుకోండి



అదపాకలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టరు శ్రీదేవి

లావేరు: ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సీపీ శ్రీదేవి అన్నారు. మండలంలోని అదపాక గ్రామానికి గురువారం వచ్చిన ఆమె ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్యసేవలు ఎలా అందిస్తున్నారో పరిశీలించారు. ఈ విధానాన్ని సక్రమంగా నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాలను, హైస్కూల్‌ను సందర్శించారు. ఆమెతో పాటు హెల్త్ అసిస్టెంట్ ఆర్.శ్యామ్ సుందర్, ఏఎన్‌ఎం సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి,ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

ఆనందపురంలో డెంగీ కలకలం



ఆనందపురంలో గ్రామంలో మందులను పిచికారీ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని ఆనందపురంలో డెంగీ కేసు నమోదైంది. గుంటూరు నుంచి ఆనందపురం గ్రామానికి ఓ వ్యక్తి జ్వరంతో రావడంతో ఆయనను రాజాం ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ డెంగీ అని నిర్ధారణ చేయడంతో గురువారం స్థానిక వైద్యులు పొన్నాడ హరితాశ్రీ, యశ్వంత్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ చిత్తిరి మంజు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తిరి మోహన్ సమక్షంలో అన్ని వీధుల్లోని కాలువల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేశారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి టి.సురేష్, హెల్త్ అసిస్టెంట్ భాస్కరరావు, పేడాడ సత్తైరాజు, ఏఎన్‌ఎం యండమూరి నాగమణి, ఎంఎల్‌ఎస్‌పి రమా, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న పార్టీ నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు:

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై అవార్డు అందుకున్న గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడు జి.లక్ష్మణరావుకు అదే పాఠశాలలో గురువారం ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, టెక్కలి డివిజన్ డిప్యూటీ విద్యాశాఖాధికారి పగడాలమ్మలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విధి నిర్వహణలో చేసిన సేవలకు గుర్తింపు లభిస్తుందన్నారు. లక్ష్మణరావు మాస్టారు అంకితభావంతో విధులు నిర్వర్తించి నేడు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై ఆదర్శంగా నిలవడంపై అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హరిబాబు, వైఎస్సార్ సీపీ యువజన నాయకులు పాలిన ఉమామహేష్, పీటీ ఎస్.నాగరాజు, ఉపాధ్యాయులు సీతమ్మ, కె.సత్యరాజ్, పి.ఢిల్లేశ్వరరావు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

వరిలో తెగుళ్ల బెడద

- వర్షాకాలంలో తెగుళ్లపై అప్రమత్తం అవసరం
- మండల వ్యవసాయాధికారి మోహనరావు సూచనలు



మెట్ట మోహనరావు, ఏవో, ఆమదాలవలస

ఆమదాలవలస రూరల్: జిల్లాలో కురుస్తున్న వర్షాలు రైతులను సంతోష పెడుతున్నాయి. జిల్లాలో వరి పంట ప్రస్తుతం 1.63 లక్షల హెక్టార్లలో సాగులో ఉంది. వరి నాట్లు పూర్తి కావడంతో జిల్లాలో చాలా ప్రాంతాల్లో సాగునీరు అందక వరినాట్లు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం అధిక వర్షాలు కురుస్తుండడం వల్ల బెట్టకు గురైన వరి పంటకు మేలు జరుగుతుంది. కొన్ని ప్రాంతాల్లో వర్షాల వల్ల పంట నీట మునగడంతో తెగుళ్ల సోకే అవకాశం ఉంటుంది. సాగునీరు పుష్కలంగా ఉన్న వరి పంటకు వర్షాల కారణంగా తెగుళ్ల సోకితే వాటి నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమదాలవలస మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు పలు సూచనలు రైతులకు తెలియజేశారు.



వరి పంటకు పురుగు మందులు పిచికారీ చేస్తున్న రైతు

వరి పంట ముంపునకు గురైతే..

వర్షాల కారణంగా వరి పంట నీట మునిగితే ముందుగా పొలంలో ఉన్న నీటిని మొత్తం బయటకు పోయేలా తగిన ఏర్పాట్లు చేయాలి. నీరు తగ్గుముఖం పట్టాక ఎకరానికి 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకుంటే తెగుళ్ల రాకుండా ముందస్తుగా నివారించవచ్చు. నీటమునిగిన వరి పంట కుళ్లిపోకుండా ఎరువులు ఉపయోగపడతాయి.

అగ్గి తెగులు

వరిలో అగ్గి తెగులు సోకినప్పుడు ముదురు ఆకుల పై నూలు కండె ఆకారంలో గోధుమరంగు మచ్చలు వచ్చి ఆకులు ఎర్రబడతాయి. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు ఎకరా పొలానికి పిచికారీ చేయాలి.



వరిలో అగ్గి తెగులు

తుప్పు తెగులు

నేలలో జింక్ లోపం ఉన్నప్పుడు తుప్పు తెగులు ఆశిస్తుంది. వరి నాటిన 2 నుంచి 6 వారాల్లో ముదురాకు చివర్లలో ఈనెకు ఇరుపక్కలా తుప్పు లేక ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు చిన్నవిగా పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. మొక్కలు గిడసబారి దుబ్బు చేయవు. పైరుకు జింక్ లోపం కనిపించగానే లీటరు నీటికి జింక్ సల్ఫేట్ కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు లేక మూడు సార్లు పిచికారీ చేయాలి.

ఆకుమచ్చ తెగులు

గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని గోకి తినివేయడం వల్ల ఆకులు తెల్లబడతాయి. పంట పిలక దశలో ఉంటే తాడుతో చేనుకు అడ్డంగా 2,3 సార్లు లాగితే పురుగులు కింద పడిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి క్లోరిఫైరిఫాస్ 2.5 ఎంఎల్ మందు చొప్పున ఎకరానికి 200 లీటర్లు పిచికారీ చేయాలి.

పాము పొడ తెగులు

వరిలో దుబ్బు చేసే దశ నుంచి ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేణా పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు ప్రొపికొనజోల్ ఎకరానికి 200 మిల్లీ లీటర్లు, లేదా ఎక్సోకోనోజల్ 400 మిల్లీ లీటర్లు ఎకరానికి జల్లుకోవాలి.



వరిలో పాముపొడ తెగులు

పరీక్షల ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని 2015–19 మధ్య డిగ్రీ చదివిన విద్యార్థులకు నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్. ఉదయ్ భాస్కర్ గురువారం విడుదల చేశారు. డిగ్రీ సప్లిమెంటరీ, 4, 6 సెమిస్టర్లు, బీపీఈడీ, డీపీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞాన భూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. డిగ్రీ ఆరో సెమిస్టర్ 3203 మంది రాయగా, 2152 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆరో సెమిస్టర్ 3607 మంది రాయగా, 1664 మంది ఉత్తీర్ణత సాధించారు. నాలుగో సెమిస్టర్‌లో బీఏలో 203 మందికి 195 మంది, బీఎస్సీలో 2654 మందికి 1753, బీబీఏలో 5కి 5, బీసీఏలో 6కి 5, బీకాం కంప్యూటర్స్‌లో 236కి 102, బీకాం జనరల్‌లో 99కి 92 మంది ఉత్తీర్ణత సాధించారు.

నాలుగో సెమిస్టర్‌లో బీఏలో 488కి 163, బీఎస్సీలో 2544 మందికి 1293, బీబీఏలో 11కి 3, బీసీఏలో 1కి 1, బీకాం కంప్యూటర్స్‌లో 236కి 90, బీకాం జనరల్‌లో 327కి 114 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సెమిస్టర్ బీపీఈడీలో 191కి 162, డీపీఈడీలో 7కి ఆరుగురు ఉత్తీర్ణత సాధించారు. వర్సిటీలో గతంలో ప్రవేశాలు నిర్వహించిన బీవీటీసీ యానిమల్ హజ్బెండరీ నాలుగో సెమిస్టర్‌లో 23కి 23, బీటీటీసీ ఫిషరీష్ సైన్స్ నాలుగో సెమిస్టర్‌లో 27కి 27మంది ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులకు అందజేసేందుకు మార్కుల జాబితాలు సిద్ధంగా ఉంచారు. 15 రోజుల్లోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం విద్యార్థులకు కల్పించారు.

ముత్తూట్ ఫైనాన్స్ ఆఫీస్‌కు తాళాలు



ముత్తూట్ ఫైనాన్స్ ఆఫీస్‌కు తాళాలు వేస్తున్న ఖాతాదారులు

నరసన్నపేట: స్థానిక జయలక్ష్మి కాంప్లెక్స్ పైఅంతస్తులో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ ఆఫీస్‌కు ఖాతాదారులు గురువారం తాళాలు వేశారు. తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని, ఖాతాదారుల సొమ్ముతో పరారైన బ్యాంకు మేనేజర్ నుంచి డబ్బు రికవరీ చేయకుండా తిరిగి ఆయనకు ముత్తూట్ ఫైనాన్స్‌కు చెందిన పైస్థాయి సిబ్బంది వత్తాసు పలుకుతున్నారని ఖాతాదారులు గురువారం మరోసారి ఆందోళనకు దిగారు. గతంలో ఆందోళన చేపట్టిన ఖాతాదారులకు కొద్దిరోజులు సమయం ఇవ్వండి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఆఫీస్ సిబ్బంది ఇంతవరకూ న్యాయం చేయలేదు. దీనిపై గురువారం ప్రశ్నించిన ఖాతాదారులకు సిబ్బంది నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో వారు ఆఫీస్‌కు తాళాలు వేశారు. ఈ సందర్భంగా ఖాతాదారులు తూముల శ్రీనివాసరావు, కూన చిన్నారావు, బచ్చు అప్పన్న, తంగుడు పకీరు, కూన వాసుదేవరావులు మాట్లాడుతూ తమ నుంచి గతంలో ఇక్కడ మేనేజర్‌గా పని చేసిన యుగంధర్ డబ్బులు తీసుకుని తప్పుడు రశీదులు ఇచ్చారని తెలిపారు. దీన్ని ఆధారాలతో సహా నిరూపించామని, గతంలో నరసన్నపేట పోలీసుల సమక్షంలో పది రోజుల్లో డబ్బులు క్లియర్ చేస్తామని, బంగారు ఆభరణాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని, 30 రోజులు అవుతున్నా స్పందన లేదని తెలిపారు. గురువారం రమ్మని చెప్పి కూడా ఎవరూ పట్టించుకోలేదన్నారు. దీంతో సహనం కోల్పోయి తప్పనిసరి పరిస్థితుల్లో ఆఫీస్‌కు తాళాలు వేశామని తెలిపారు. ఇప్పటికైనా ముత్తూట్ ఫైనాన్స్ పైస్థాయి ప్రతినిధులు జోక్యం చేసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యత



మాట్లాడుతున్న కృష్ణమోహన్

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పంచాయతీ రాజ్ ఈటీసీ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో జరుగుతున్న పంచాయతీ కార్యదర్శుల రెండో విడత పునశ్చరణ శిక్షణలో భాగంగా గురువారం నాలుగో రోజు శిక్షణలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో సిమెంట్ డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి సౌకర్యం, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యంకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ప్రభుత్వ గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ఏర్పడిన తర్వాత అనేక మార్పులు వచ్చాయని అన్నారు. గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ భవనాలు వంటి అనేక నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలో సుపరిపాలన సాగుతుందని, ప్రజల అవసరాలు స్థానికంగా తీరుతున్నాయని అన్నారు. గ్రామాలు పూర్తిస్థాయిలో ప్రగతి సాధించాలంటే మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ పథకాల అమలు కీలకమని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, డీపీఓ రవికుమార్, రీసోర్సు పర్సన్లు శంకరావు, సత్యకేశవ, డీపీఎం ఎస్.లోక్‌నాథ్ పాల్గొన్నారు.

వర్సిటీకి పాలక మండలి నియామకం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి పాలక మండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) నియమించారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జె.శ్యామలరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాలక మండలి మూడేళ్లు కొనసాగనుంది. పాత పాలక మండలి ఆరు నెలల క్రితం టర్మ్ పూర్తికావటంతో రద్దయ్యింది. ఈ పాలక మండలిలో విశ్వ విద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ విభాగంలో ప్రొఫెసర్ పీలా సుజాత, పిన్సిపాల్ విభాగంలో ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్ల విభాగంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, వర్సిటీ అధ్యాపకుల విభాగంలో డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, అనుబంధ కళాశాలల అధ్యాపకులు విభాగంలో పాతపట్నం డిగ్రీ కళాశాల ఎకనామిక్స్ అధ్యాపకులు చక్రపతి, పరిశ్రమలు, న్యాయ విభాగం, సంఘసేవ విభాగాలకు సంబంధించి గడ్డ శ్రీనిబాబు, పైడి వాసమ్మ, పెద్ద రమణకుమారి, కారెడ్ల మాధవిలను నియమించారు.

పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి కృషి



శాలిహుండం పర్యాటక భవనాన్ని పరిశీలిస్తున్న టూరిజం ఈడీ ఏఎల్ మల్‌రెడ్డి

గార: జిల్లాలో ఎన్నో ఆకర్షణీయ పర్యాటక ప్రదేశాలున్నాయని, వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏఎల్ మల్‌రెడ్డి అన్నారు. మండలంలోని శాలిహుండం పర్యాటక బౌద్ధారామం, వసతి గృహాలను ఆయన గురువారం పరిశీలించారు. వేణుగోపాలస్వామి కొండ కింద భాగంలోని ప్రాంగణాన్ని వెంటనే పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కొండపైనున్న రిసార్టును పరిశీలించి పలు సూచనలు చూశారు. అక్కడి నుంచి వంశధార నది, పరిసర ప్రాంతాలను చూసి చాలా అందమైన ప్రదేశమని కితాబిచ్చారు. కళింగపట్నం బీచ్‌ను పరిశీలించి పర్యాటకులకు అనుగుణంగా పలు నిర్మాణాలు చేపట్టాలని టూరిజం ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో పర్యాటక రంగం అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధితోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని చెప్పారు. ప్రభుత్వానికి ఆదాయ వనరులతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. యువ పర్యాటక క్లబ్బులు ఏర్పాటు చేయడంతో పాటు పర్యాటక ప్రదేశాలపై విస్తృత ప్రచారం కూడా అవసరమన్నారు. శాలిహుండం, కళింగపట్నంలో పర్యాటకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖాధికారి నడిమింటి నారాయణరావు, ఈఈ రమణ, డీఈ స్వామి, ఏఈ సీతారామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో నూతన వంతెనకు టెండర్



నూతన వంతెన నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ జాన్ సుధాకర్, అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: బాహుదా వంతెన కూలిన మూడు నెలల్లో కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, మరో రెండు నెలల్లో కొత్త వంతెనకు టెండర్ పూర్తవుతుందని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్ అన్నారు. ఆయన బుధవారం ప్రత్యామ్నాయ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ సుమారు రూ.20కోట్లతో పాత వంతెన పక్కన కొత్త వంతెన నిర్మించేందుకు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని అన్నారు. వంతెన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించామని, బాహుదా నదికి భారీగా వరద నీరు చేరినప్పుడు వంతెనపై నుంచి నీరు పారే చాన్స్ లేకుండా పాత వంతెనకు కాస్తా ఎత్తులో కొత్త వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయంగా నిర్మించిన వంతెనపై కేవలం రెండు, మూడు చక్రాల వాహనాలకే అనుమతులు ఇచ్చామని, అనుమతులు పాటించని వాహనాలపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఆయన వెంట ఈఈ పి.సత్యనారాయణ, డీఈ ఎస్.రామినాయుడు, ఏఈఈ డి.మోహనరావులు ఉన్నారు.

12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్‌కు ఎంపికలు

సీతంపేట: ఈ నెల 12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌కు ఎంపికలు జరగనున్నాయని ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అన్ని పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల స్థాయిలో ప్రతిభగల క్రీడాకారులను ఎంపిక చేసి పంపించాలన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి గేమ్స్ జరగాల్సి ఉన్నప్పటికీ వర్షాలు కురుస్తున్న కారణంగా తాత్కాలికంగా వాయిదా పడ్డాయని తెలిపారు. ఈ విషయాన్ని గమనించాలన్నారు.

● ప్రగతి 'బాట'న



ఒకప్పుడు బెండి నుంచి కోసంగిపురం వెళ్లే రోడ్డు దుస్థితి



ప్రస్తుతం రోడ్డు

పలాస: వజ్రపుకొత్తూరు మండలం బెండి గేటు నుంచి కాశీబుగ్గ పాతజాతీయ రహదారి, కోసంగిపురం కూడలి వరకు గల రోడ్డు రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు ఈ రహదారి నరకాన్ని తలపించేది. స్థానిక మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చొరవ చూపి సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లి రూ.2కోట్లు మంజూరు చేశారు.

దీంతో ఈ రోడ్డుకు మోక్షం కలిగింది. ఇప్పుడు పనులు పూర్తి కావడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు సులభం

- పంచాయతీల్లో ప్లాన్ అప్రూవల్స్‌కు వెసులుబాటు
- 300 చదరపు గజాల్లోపు నిర్మాణాలకు పంచాయతీల్లోనే ఇక నుంచి అనుమతులు

నరసన్నపేట:

జిల్లాలో ఇళ్ల నిర్మాణాలతో పాటు షాపులు ఇతర నిర్మాణాలకు పంచాయతీలు అనుమతులు ఇవ్వనున్నాయి. నిర్మాణదారులు పంచాయతీల నుంచే విధిగా అనుమతులు పొందాల్సి ఉంటుంది. 300 చదరపు గజాలులోపు 9 మీటర్ల ఎత్తు వరకూ నిర్మాణాలకు ఇక నుంచి పంచాయతీ లే అనుమతులు ఇస్తాయి. 2020 అక్టోబర్‌కు ముందు అన్ని నిర్మాణాలకు పంచాయతీల్లో అనుమతులు పొంది నిర్మాణదారులు పనులు కొనసాగించే వారు. 2020 అక్టోబర్ తర్వాత ఎలాంటి నిర్మాణం చేపట్టాలన్నా శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (సుడా) అనుమతి తప్పనిసరి అని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీలు అనుమతులు ఇవ్వవద్దని ఆదేశించింది. అప్పటి నుంచి ఆగస్టు నెలాఖరు వరకూ ఇదే పద్ధతి కొనసాగింది. ఈ ఉత్తర్వులకు ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం అధికారులు సడలింపునిచ్చారు. ఈ మేరకు జీఓ ఎంఎస్ నంబరు 275, 119 లను జారీ చేశారు. దీని ప్రకారం కొన్ని పరిమితులు పెట్టి పంచాయతీలు ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం 300 చదరపు మీటర్ల లోపు స్థలంలో, 9 మీటర్లు ఎత్తు దాటకుండా ఉన్న నిర్మాణాలకు అనుమతులు ఇవ్వవచ్చు. అంతకు మించి విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టినా ఎత్తు మించినా విధిగా సుడా అనుమతులు తీసుకోవాలి.



నరసన్నపేట మేజరు పంచాయతీ వ్యూ

అనధికార కట్టడాలకు చెక్

పంచాయతీలు అనుమతి ఇవ్వడం ఆపేసిన నాటి నుంచి జిల్లావ్యాప్తంగా అనధికార కట్టడాలు అధికమయ్యాయి. చిన్న నిర్మాణ దారులు సుడా నుంచి అనుమతులు పొందలేక తామే ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టారు. చాలామంది ప్లాన్ అప్రూవల్స్ పొందకుండానే నిర్మాణాలు చేశారు. దీంతో పంచాయతీలకు ఆదాయం పడిపోగా నిర్మాణాలు అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోయాయి. తాజా ఉత్తర్వులతో అనధికార నిర్మాణాలకు అడ్డుకట్ట పడనుంది. 300 చదరపు అడుగులు లోపు నిర్మాణాలకు అనుమతులు పంచాయతీలు ఇవ్వవచ్చని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఇక నుంచి ప్రతి నిర్మాణం అధికారుల అనుమతితో జరగనుంది. దీంతో పంచాయతీలకు ఆదాయం కూడా పెరగనుంది. దీంతో మేజరు పంచాయతీ పాలక వర్గాలతో పాటు పట్టణ శివార్లలో ఉన్న మైనర్ పంచాయతీలకు ఆదాయం పెరుగుతుంది. దీంతో పంచాయతీ సర్పంచ్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పరిమితులకు లోబడి ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జీఓ నంబర్ 275, 119ల ప్రకారం సెప్టెంబర్ ఒకటి నుంచే నిబంధనలు మారాయి.

ఆనందంగా ఉంది



మేజరు పంచాయతీలకు ప్లాన్ అప్రూవల్స్‌తోనే అధికంగా ఆదాయం సమకూరుతుంది. సుడా పరిధిలోకి ఈ అనుమతులు వెళ్లడంలో పంచాయతీలకు ఆదాయం బాగా తగ్గింది. పారిశుద్ధ్య పనివారికీ నెల వారీ జీతాలు ఇచ్చేందుకు ఇబ్బందులు పడ్డాం. పంచాయతీ రాజ్ అధికారులు మా మొర ఆలకించి నిబంధనలు సడలించడంతో ఇప్పుడు ఆదాయం పెరగనుంది. ఆనందంగా ఉంది.

– బూరల్లి శంకర్, సర్పంచ్, నరసన్నపేట

దరఖాస్తు చేసుకోవచ్చు



సడలించిన నిబంధనల మేరకు అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించనున్నాం. ఈ మేరకు పట్టణంలో జరుగుతున్న నిర్మాణదారులకు నోటీసులు జారీ చేస్తాం. నూతన జీఓ ప్రకారం 300 చదరపు అడుగుల లోపు, 9 మీటర్లు ఎత్తు దాటకుండా ఉన్న నిర్మాణాలను గుర్తించే పని ప్రారంభించాం. పై అధికారుల సూచనల మేరకు ఇలాంటి నిర్మాణాలకు ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చి క్రమబద్ధీకరిస్తాం. కొత్త నిర్మాణాలకు అనుమతులు ఇస్తాం.

– సింహాద్రి నాయుడు, ఈఓ, నరసన్నపేట

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220